నమస్తే తెలంగాణ

# పెద్దపల్లి

5 | కరీంనగర్, ఆదివారం 10 నవంబర్ 2024 | PEDDAPALLI

## ప్రగల్భాలు మాని పాలనపై దృష్టి పెట్టు

మాజీ ఎమ్మెల్యే సుంకె ఆగ్రహం

చొప్పదండి, నవంబర్ 9 : ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి పనికిమాలిన ప్రగల్భాలు మాని పరిపాలనపై దృష్టి పెట్టాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హితవు పలికారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం జరిగిన సీఎం రేవంత్ పాదయాత్ర కేసీఆర్‌పై తిట్ల పురాణానికే సరిపోయిందని విమర్శించారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, తెలంగాణ సాధకుడు, తండ్రి వయసున్న కేసీఆర్‌పై నోటికొచ్చినట్లు మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ కాలి గోటికి కూడా రేవంత్‌రెడ్డి సరిపోడని, సీఎం పదవి స్థాయి దిగజార్చి మాట్లాడుతున్నాడని విమర్శించారు. తప్పు మీద తప్పు చేస్తున్న ఆయన తీరును తెలంగాణ ప్రజలంతా గమనిస్తున్నారని తెలిపారు. మూసీ నీళ్లతో కడిగినా రేవంత్ నోరు మురికి పోదని, వంకర బుద్ధి ఇక మారదని, తాము చిల్లరగా మాట్లాడలేమని పేర్కొన్నారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిన గంభీరమైన చరిత్ర కేసీఆర్‌దని కొనియాడారు. బ్యాగులు మోసి, పంచి అడ్డ తోవన అధికారంలోకి వచ్చిన నీచ చరిత్ర రేవంత్‌రెడ్డిదని మండిపడ్డారు. కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలు సీఎం నీచ సంస్కృతికి అద్దం పడుతున్నాయన్నారు. మరోసారి ఇలా మాట్లాడితే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

## ప్రశ్నిస్తే దాడులా..?

• జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల, నవంబర్ 9: ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై పోలీసుల దాడి అప్రజాస్వామికమని జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నిస్తే దాడులకు పాల్పడే ఇంత పిరికి ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదని ధ్వజమెత్తారు. హుజూరాబాద్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం సాక్షిగా ఎమ్మెల్యేపై జరిగిన దాడిని ఖండిస్తున్నట్టు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అంటేనే సీఎం రేవంత్ రెడ్డికి భయం పట్టుకున్నదని, ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు నిలదీస్తున్న కౌశిక్ రెడ్డిపై కక్ష పెంచుకున్నారని మండిపడ్డారు. దళితబంధు లబ్ధిదారులకు రెండో విడత ఆర్థిక సాయం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరడమే కౌశిక్ రెడ్డి చేసిన తప్పా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ప్రజా పాలన అని చెప్పుకుంటూ రాక్షస పాలన చేస్తున్నారని, నాటి ఇందిరమ్మ ఎమర్జెన్సీ నిర్బంధ పాలనను తలపించేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటూ వారి పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఆరోగ్యం, భద్రతపై పూర్తి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు.



◄ మహిళను ఈడ్చుకెళ్తున్న పోలీసులు



నొప్పితో విలవిల్లాడుతున్న బాధితుడు రామంచ రాకేశ్ ◄

హుజూరాబాద్ రణరంగం

న్యాయం కోసం రోడ్డెక్కిన దళితబిడ్డలపై పోలీసులు విరుచుకుపడ్డారు. దళితులకు మద్దతుగా నిలిచిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపైనా దౌర్జన్యానికి దిగారు. లాఠీలెత్తకుండా పక్క బొక్కలపై పిడిగుద్దులు గుద్దుతూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పట్టు వదలని దళితులు విడుతల వారీగా ధర్నాకు దిగడం, అదే తీరుగా పోలీసులు విరుచుకుపడడంతో శనివారం హుజూరాబాద్‌లో ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. దళితుల డప్పు చప్పుళ్లు, నినాదాలతో పట్టణం హోరెత్తింది. దళితబంధు రెండో విడుత నిధుల కోసం సాగిన ఈ ధర్నాతో తెలంగాణ ఉద్యమం నాటి పోరాట స్ఫూర్తి కనిపించింది. దాదాపు మూడు వేలకుపైగా లబ్ధిదారులు ధర్నాలో పాల్గొని తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలీసుల దాష్టీకానికి ఎమ్మెల్యే, మహిళ సహా ఐదుగురు గాయపడ్డారు. దళితులపై ఇలా దౌర్జన్యానికి దిగడాన్ని ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా ఖండిస్తున్నారు.



కౌశిక్‌రెడ్డిని బలవంతంగా వాహనం ఎక్కిస్తున్న పోలీసులు

# దళితులపై దౌర్జన్యం

దళితబంధు రెండో విడుత నిధుల కోసం లబ్ధిదారులపై పోలీసుల దాష్టీకం

- ఇరువర్గాల మధ్య తీవ్ర స్థాయిలో తోపులాట
- మద్దతుగా నిలిచిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం
- పక్కబొక్కలపై పిడిగుద్దులు
- ప్రతిఘటించిన దళితులపైనా దాడి
- ఎమ్మెల్యే సహా ఐదుగురికి గాయాలు
- సొమ్మసిల్లి పడిపోయిన కౌశిక్‌రెడ్డి
- కరీంనగర్ తరలింపు
- మాజీ మంత్రి గంగుల కమలాకర్ పరామర్శ

కరీంనగర్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ)/ హుజూరాబాద్/ హుజూరాబాద్‌టౌన్ : దళితుల అభ్యున్నతి కోసం గత కేసీఆర్ ప్రభుత్వం దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టి హుజూరాబాద్ నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టింది. అందులో భాగంగా 18,021 కుటుంబాలకు ₹10 లక్షల చొప్పున మంజూరు చేసింది. అయితే, వీరిలో కొందరికి రెండో విడుత కింద రావాల్సిన నిధులను ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేయకుండా అడ్డుకుంటున్నది. పది నెలల కాలంగా విజ్ఞప్తులు, విన్నపాలు చేస్తూ వచ్చినా కనికరించకపోవడంతో దళితబిడ్డలు ఆందోళనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో దళిత బంధు రెండో విడుత వచ్చే వరకు 'మీ వెంట ఉంటా'నని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి భరోసానిచ్చారు. శనివారం లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ప్రభుత్వానికి విన్నవిస్తానని చెప్పారు. దీంతో నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి లబ్ధిదారులు హుజూరాబాద్‌లోని ఎమ్మెల్యే ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా కొందరు దళితులు స్థానిక చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేయాలని కోరగా, ఎమ్మెల్యే తన ఇంటి నుంచి బయలు దేరేందుకు ప్రయత్నిస్తుండగానే పోలీసులు అడ్డుకోవడం ప్రారంభించారు. అయినా, వారిని ఛేదించుకుని ఎమ్మెల్యే చౌరస్తాకు చేరుకొని, తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల మధ్యనే అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడే వరంగల్-కరీంనగర్ ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేస్తున్న కొంత మంది దళితులకు మద్దతుగా కూర్చునే ప్రయత్నం చేశారు.



ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యేలు వొడితల సతీశ్‌కుమార్, సుంకె రవిశంకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

దీంతో పోలీసులు ఎమ్మెల్యేను అక్కడి నుంచి తరలించేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా పోలీసులు, దళితుల మధ్య తోపులాట జరిగింది. ఎమ్మెల్యే చుట్టూ పెద్ద సంఖ్యలో పోలీసులు మోహరించి, బలవంతంగా పోలీసు వాహనంలోకి లాక్కెళ్లారు. ఆయన ప్రతిఘటించడంతో చర్మం, చేతులు వడిపెట్టడం, పక్క బొక్కలపై పిడిగుద్దులు గుద్దడం వంటి చర్యలకు దిగారు. ఎమ్మెల్యేకు ఊపిరాడని పరిస్థితి కల్పించారు. ఈ క్రమంలో అడ్డుకున్న దళిత యువకులపైనా దౌర్జన్యం చేశారు. పిడి గుద్దులు గుద్దడం, చేతులు వెనకకు విరవడం వంటి చర్యలకు పాల్పడ్డారు. దీంతో ఇల్లందకుంట మండలం కనగర్తికి చెందిన రామంచ రాకేశ్, జమ్మికుంట పట్టణానికి చెందిన నాని, జమ్మికుంట మండలం మాచనపల్లికి చెందిన పర్లపల్లి రమేశ్ తీవ్రంగా గాయపడ్డారు. ధర్నా సమయంలో హుజూరాబాద్ పట్టణంలోని బోర్నపల్లికి చెందిన పర్లపల్లి రాజమణిని పోలీసులు తోసి వేయడంతో కింద పడింది. ఆమె తలకు గాయాలవగా, స్థానిక ప్రైవేట్ దవాఖానకు తరలించారు. మిగతా ముగ్గురు ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నారు.

### సొమ్మసిల్లిన ఎమ్మెల్యే కౌశిక్

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని అదుపులోకి తీసుకునే క్రమంలో పోలీసులు పిడిగుద్దులు గుద్దడంతో ఆయన సొమ్మసిల్లారు. దీంతో ఆయనను స్థానిక ఏరియా దవాఖానకు తరలించారు. ఎమ్మెల్యేకు శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారడంతో దళితులే చొక్కా విప్పి ఉప చర్యలు చేశారు. వైద్యులు ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం స్పృహలోకి వచ్చిన కౌశిక్‌రెడ్డిని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పరామర్శించారు. ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉందని కౌశిక్‌రెడ్డి తెలుపడంతో ఆయనను కరీంనగర్‌లోని అపోలో రీచ్‌కు తరలించారు. గంగులతో పాటు మాజీ ఎమ్మెల్యేలు వొడితల సతీశ్‌కుమార్, సుంకె రవిశంకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు కూడా అక్కడికి చేరుకున్నారు. చికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని విశ్రాంతి కోసం వీణవంక మండలకేంద్రంలోని ఆయన నివాసానికి పంపించారు.



హుజూరాబాద్ దవాఖానలో నొప్పితో తల్లడిల్లుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

### దళితులకు గంగుల పరామర్శ

హుజూరాబాద్‌లో జరిగిన పరిణామాలను తెలుసుకున్న మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఏరియా దవాఖానలో ఉన్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని కలిసి పరిస్థితిని తెలుసుకున్నారు. తర్వాత దళితులను పరామర్శించారు. తమకు ఊపిరి ఆడడం లేదని, పోలీసులు తమపై పిడిగుద్దులు కురిపించారని దళితులు రమేశ్, నాని, రాకేశ్ వివరించారు. అవసరమైతే హైదరాబాద్ తీసుకెళ్లి చికిత్స చేయిస్తామని గంగుల వారికి భరోసా ఇచ్చారు.

### రెండు గంటలపాటు ఉద్రిక్తత

ధర్నాను విచ్ఛిన్నం చేసేందుకు పోలీసులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటి నుంచి వస్తున్న దళితులను అడ్డుకున్నది మొదలు.. ఆయనను స్థానిక ఏరియా దవాఖానలో చేర్పించే వరకు పోలీసులు, దళితులకు మధ్య తోపులాట జరిగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు పట్టణంలో ఉద్రిక్త వాతావరణం కనిపించింది. ఎమ్మెల్యే ధర్నాలో పాల్గొనకుండా పోలీసులు గట్టిగా ప్రయత్నించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సహా పలువురు దళితులు వాదనకు దిగారు. తమకు న్యాయం చేయాలని అడిగితే కొడతారా.. అంటూ నిలదీశారు. మూడు వేల మందికిపైగా దళితులు పట్టణాన్ని చుట్టుముట్టడంతో తెలంగాణ ఉద్యమం నాటి పరిస్థితులు మళ్లీ కళ్లకు కట్టాయి. ఎమ్మెల్యేను బలవంతంగా అదుపులోకి తీసుకున్న పోలీసులు అక్కడి నుంచి తరలిస్తుండగా దళితులు తీవ్రంగా ప్రతిఘటించారు. దీంతో పోలీసులకు, ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వరంగల్, కరీంనగర్ ప్రధాన రహదారిపై ఎటు మూడు, నాలుగు కిలో మీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. ట్రాఫిక్ కంట్రోల్ చేసేందుకు గంటన్నర సమయం పట్టింది.



### రేవంత్‌కు మా ఉసురు తగులుద్ది

దళితుల జీవితాలు బాగుపడాలని కేసీఆర్ దళితబంధు పథకం తెచ్చి డబ్బులు ఇస్తే, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండో విడుత డబ్బులు నిలుపుదల చేసి మమ్ముల గోసపెడుతుండు. రేవంత్ రెడ్డికి మా ఉసురు తగులుద్ది. హుజూరాబాద్‌లో రెండో విడుత డబ్బులు రావాల్సిన లబ్ధిదారులు 5వేల మందికి పైనే ఉన్నరు. ఇప్పటివరకు అధికారుల చుట్టు 20 సార్ల తిరిగి వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోలే. వారిలో చలనం రావాలనే ఈ రోజు హుజూరాబాద్‌లో ధర్నా చేసినం. మాకు అండగా ఉండి మా కోసం వచ్చిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై పోలీసులు దాడి చేయడం సరికాదు. మా అకౌంట్లో ఉన్న డబ్బులు మాకిచ్చేందుకు కాంగ్రెస్‌కు వచ్చిన కడుపునొప్పి ఏంది? ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని దళిత బంధు డబ్బులు ఇవ్వాలి.

- సౌజన్య, చల్లూరు (వీణవంక మండలం)

### మార్పు అంటే ఇదేనా..?



సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఎన్నోమాటలు చెప్పిండు. దళితబంధు రూ.12లక్షలు ఇస్తానని నమ్మించిండు. మోసం చేసిండు. మా అకౌంట్లలో కేసీఆర్ సర్కారు వేసిన దళితబంధు రెండో విడుత డబ్బులే తీసుకోకుండా ఇబ్బందులు పెడుతూ, మా నోటికాడి బుక్కను లాక్కుంటండు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తానని చెప్పి మాట తప్పిండు. మార్పు అంటే ఇదేనా..? వెంటనే ప్రభుత్వం స్పందించి రెండో విడుత సాయం ఇవ్వాలి.

- రజిత, జమ్మికుంట మండలం

---

## కాంగ్రెస్‌లో చేరనందుకే అట్రాసిటీ కేసు

- కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే నాపై వేధింపులు
- పోలీసులు ఆ పార్టీ కార్యకర్తల్లా ప్రవర్తిస్తున్నారు
- బెదిరింపులకు బెదిరిపోను.. న్యాయబద్ధంగా పోరాటం చేస్తా
- పెగడపల్లి సింగిల్ విండో చైర్మన్ వోరుగంటి రమణారావు

జగిత్యాల, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల క్షక సాధింపులో భాగంగానే తనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారని బీఆర్ఎస్ నాయకుడు, పెగడపల్లి సింగిల్ విండో చైర్మన్ వోరుగంటి రమణారావు ఆరోపించారు. పెగడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై నమోదైన అట్రాసిటీ కేసుపై శనివారం రాత్రి ప్రకటన జారీ చేశారు. బీఆర్ఎస్‌లో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న తనను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలో చేరాలంటూ ఆ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఒత్తిడి తెచ్చారన్నారు. కాంగ్రెస్‌లో చేరకపోవడంతో కక్ష సాధింపు చర్యలు, రాజకీయ వేధింపులు, బెదిరింపులు, తప్పుడు కేసులకు తెగబడుతున్నారన్నారు. పెగడపల్లి సింగిల్ విండో పరిధిలో ఎలాంటి అవకతవకలు జరుగకపోయినా తప్పుడు ఆరోపణలతో చర్యలు చేపట్టారన్నారు. సింగిల్ విండోను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి, ఆదర్శ సింగిల్ విండోగా మార్చితే ఎంబీ రికార్డులు లేవంటూ, నిధుల దుర్వినియోగం అంటూ వేధింపులకు గురిచేశారన్నారు. చర్యలు తీసుకోకుండా ఉండాలంటే తమను కలవాలని, కాంగ్రెస్‌లో చేరాలంటూ బెదిరించారన్నారు. కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఎన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టినా, పార్టీ మారకపోవడంతో వ్యక్తిగతంగా టార్గెట్ చేసి తప్పుడు కేసులు బనాయించేందుకు తెగబడ్డారన్నారు. ఈ నెల 5న పెగడపల్లిలో అమెరికా నుంచి వచ్చిన మాజీ సర్పంచ్‌తో మాట్లాడుతున్న సమయంలో అక్కడికి వచ్చిన కాంగ్రెస్ నాయకులు అనవసరంగా వివాదాన్ని సృష్టించారని, వాగ్వాదానికి దిగి ఇష్టారాజ్యంగా మాట్లాడారన్నారు. తాను ఎలాంటి ఘర్షణకు, వాగ్వాదానికి దిగకపోయినా తనపైన తప్పుడు ఫిర్యాదు చేసి, కేసు నమోదు చేయించారన్నారు. 8న కేసు నమోదు చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధుల ప్రోత్సాహంతోనే పోలీసులు తప్పుడు కేసు నమోదు చేశారని ఆరోపించారు. ఇంకా పెగడపల్లి పోలీసులు విలేకరుల గ్రూప్‌లో కేసు నమోదు వివరాలను పోస్ట్ చేయడంతోపాటు ప్రతి ఒక్క విలేకరికి ఫోన్ చేసి కచ్చితంగా వార్త ప్రచురితం కావాలని, ఒత్తిడి తేవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రెస్, పోలీస్ గ్రూప్‌తోపాటు ఇతర జనరల్ వాట్సాప్ గ్రూప్‌లో సైతం పోలీసు అధికారే స్వయంగా కేసు నమోదు విషయాన్ని పోస్టు చేసినట్లు తెలుస్తోందని, ఇది సరైన పద్ధతేనా..? అని ప్రశ్నించారు. పోలీసులు అధికార పార్టీకి వత్తాసు పలకడమే గాక, కార్యకర్తల్లా పనిచేస్తున్నారని ఆరోపించారు. తప్పుడు కేసులు పెట్టి, రాజకీయంగా, ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా వేధింపు చర్యలు చేపట్టడం ప్రజాస్వామ్య వ్యవస్థకే గొడ్డలిపెట్టు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకుల కక్ష సాధింపు చర్యలకు బెదిరిపోమని, చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా పోరాటం చేస్తామన్నారు. పెగడపల్లి సింగిల్ విండో అంశంతో పాటు, ఎస్సీఎస్టీ కేసు విషయమై పాత్రికేయులు నిజనిర్ధారణ చేయాలని కోరారు.

### పెగడపల్లి విండో చైర్మన్‌పై అట్రాసిటీ కేసు

పెగడపల్లి, నవంబర్ 9: పెగడపల్లి విండో చైర్మన్ రమణారావుపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రవికిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో తోటి నాయకులతో ఉన్న తనను, లింగాపూర్‌కు చెందిన రమణారావు కులం పేరుతో దూషించాడని విజయభాస్కర్ ఫిర్యాదు చేయగా, జగిత్యాల డీఎస్పీ ఆదేశాల మేరకు అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు వివరించారు.

## సీఎం, మంత్రిపై చర్యలు తీసుకోవాలి

- రాజన్న సిరిసిల్ల ఎస్పీకి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య ఫిర్యాదు

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఆందోళనకర, హింసాత్మక వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య జిల్లా ఎస్పీకి శనివారం అత్యవసర ఫిర్యాదు చేశారు. శుక్రవారం జరిగిన వడ్డేపల్లి సమావేశంలో కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా, హింసను ప్రత్యక్షంగా సీఎం, మంత్రి ప్రేరేపించే వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారంలో ఉన్న వారు ఇలాంటి భాష వల్ల తెలంగాణలో శాంతి, సుస్థిరతకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందన్నారు. ఈ కేసులో చట్టాన్ని కఠినంగా అమలు చేయడం, అత్యవసరంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వారి వ్యాఖ్యలు ప్రజాస్వామ్య సూత్రాలను ఉల్లంఘించడమే కాకుండా ప్రజా భద్రత, హింసను ప్రేరేపించే అనేక చట్టపరమైన నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## కూల్ డ్రింక్ అనుకొని గడ్డిమందు తాగి..

- ఇటిక్యాల మోడల్ స్కూల్ విద్యార్థినికి అస్వస్థత
- దవాఖానకు తరలింపు
- తప్పిన ప్రాణాపాయం

రాయికల్, నవంబర్ 9: కుటుంబ సభ్యుల మీద కోపంతో ఓ విద్యార్థిని శీతలపానీయంలో కలుపుకొని తెచ్చిన గడ్డిమందును ఆమె స్నేహితురాలు కూల్ డ్రింక్ అనుకొని తాగి దవాఖాన పాలైంది. వివరాల ప్రకారం.. రాయికల్ మండ లం ఇటిక్యాల ఆదర్శ పాఠశాలలో ఆలూరుకు చెందిన ఓ విద్యార్థిని తొమ్మిదో తరగతి చదువుతున్నది. ఇటీవల ఇంటికి వెళ్లిన ఆ బాలిక, కు టుంబ సభ్యులతో గొడవ పడింది. వారిని భయపెట్టాలని భావించి కూల్‌డ్రింక్‌లో గడ్డిమందును కలుపుకొని శనివారం వసతి గృహానికి చేరింది. అయితే మరో విద్యార్థిని ఆ బాటిల్‌ను చూసి కూ ల్‌డ్రింక్ అనుకొని తాగింది. మొదటి బాలిక దీని ని గమనించి వెంటనే టీచర్స్‌కి చెప్పడంతో, వారు ఆమెను జగిత్యాల దవాఖానకు తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా ఉపవైద్యాధికారి డా శ్రీనివాస్ దవాఖానకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ప్రమాదం లేదని ఆయన తెలిపారు.

## 'యునాని'కి తాళం

- అధికారుల నిర్లక్ష్యం.. రోగులకు శాపం
- వైద్యుల కొరత.. అందని వైద్యం
- నెలరోజులుగా మూతపడ్డ దవాఖాన గది

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ) : యునాని ఉచిత వైద్యం పేదలకు అందని ద్రాక్షగా మారింది. అధికారుల నిర్లక్ష్యంతో దవాఖానకు తాళం పడింది. వైద్యుల కొరత రోగులకు శాపంగా మారింది. రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన దవాఖానలోని యునాని వైద్యశాలకు తాళం వేసి నెలరోజులవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీర్ఘకాలిక వ్యాధులకు మెరుగైన వైద్యం అందించే యునాని వైద్యశాలలో వైద్యుడు లేకపోవడంతో కాంపౌండర్‌తోనే నడిపించారు. ఇటీవల బదిలీల్లో భాగంగా కాంపౌండర్ కూడా మరోచోటికి బదిలీపై వెళ్లడంతో వైద్య సేవలు నిలిచి పోయాయి. యునాని వైద్యశాలకు కిడ్నీలో రాళ్లు, పిస్టులా, పైల్స్, తెల్లపూత, షుగర్, ఊపిరి తిత్తులు, తదితర వ్యాధులకు చికిత్స కోసం జిల్లాలోని 13 మండలాల నుంచి పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వీరందరికీ ఇక్కడ ఉచితంగా మందులు ఇస్తుంటారు. గత రెండు నెలలుగా తాళం వేసి ఉంటుండడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు.

### ప్రత్యేక భవనం లేక అవస్థలు

పెద్ద సంఖ్యలో రోగులకు సేవలందించే యునాని వైద్యశాలకు కనీస వసతులు కూడా లేవు. చాలా కాలంగా అంబేడ్కర్‌నగర్‌లోని ఓ అద్దె ఇంటిలో దవాఖానను ఏర్పాటు చేశారు. అది ప్రజలకు అందుబాటులో లేక పోవడంతో జిల్లా ప్రధాన దవాఖానకు మార్చి ఒక చిన్న గదిని కేటాయించారు. వైద్యుడు తప్ప రోగులు కూడా కూర్చునే వీలు లేని గదిని కేటాయించడంతో వైద్యులు, కాంపౌండర్ ఈ వైద్యశాలకు రావడానికి ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. దీంతో ఇక్కడి రోగులు రవాణా ఖర్చులు భరిస్తూ కరీంనగర్, సిద్దిపేటకు వెళ్లాల్సి వస్తున్నది. మెరుగైన వసతులు కల్పించి, పూర్తి స్థాయిలో ఒక వైద్యుడు, కంపౌండర్‌లను నియమించాల్సిన అవసరం ఉంది.



సిరిసిల్ల జిల్లా ప్రధాన దవాఖానలో తాళం వేసి ఉన్న యూనాని దవాఖాన

### ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలి

యునాని వైద్యం కోసం పెద్ద సంఖ్యలో రోగులు వస్తుంటారు. చాలా కాలంగా వైద్యుడు లేక కంపౌండరే వైద్యం అందించారు. ఈ మధ్య కాలంలో బదిలీల కారణంగా కంపౌండర్ కూడా బదిలీ అయ్యారు. దీంతో అప్పటి నుంచి గదికి తాళం వేస్తున్నారు. ఉచిత వైద్య సేవలందించే యునాని దవాఖానలో వైద్యుడిని నియమించేలా కలెక్టర్ చొరవ తీసుకోవాలి. అలాగే, ప్రత్యేక భవనం నిర్మించి సరిపడా వైద్యులను నియమించాలి.

- చింతోజు భాస్కర్, చైర్మన్ మానేరు స్వచ్ఛంద సంస్థ

## ఉల్లాసంగా అనుతమ-2024

- 'చల్మెడ'లో అలరించిన వైద్య కళాశాల వార్షికోత్సవం





జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కళాశాల చైర్మన్ చల్మెడ లక్ష్మీనరసింహారావు, నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కరీంనగర్ రూరల్, నవంబర్ 9 : కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలోని చల్మెడ ఆనందరావు వైద్య కళాశాలలో అనుతమ-2024 పేరుతో శనివారం నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలు అలరించాయి. ఈ కార్యక్రమానికి ప్రముఖ బేరియాట్రిక్ సర్జన్ డాక్టర్ కోన ఎస్ లక్ష్మీకుమారి హాజరై కళాశాల చైర్మన్ చల్మెడ లక్ష్మీనరసింహారావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కోన ఎస్ లక్ష్మీకుమారి మాట్లాడుతూ వైద్య రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా వైద్య విద్యార్థులు అనునిత్యం విజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మెడికోలు తమ ఆటాపాటతో హోరెత్తించారు. పలు సంప్రదాయ పద్ధతుల నృత్యాలతో అలరించారు. వేడుకల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ అసీమ్ అలీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి అనిత, అంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ ఎజీలాసీ, జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ సంజయ్, తదితరులు పాల్గొన్నారు.